క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో ఆలీకేఫ్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి



చెక్కును తీసుకుంటున్న డీఎంసీ వేణుగోపాల్

అంబర్‌పేట: జీహెచ్ఎంసీ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలని సర్కిల్–16 డీఎంసీ వేణుగోపాల్ అన్నారు. ముందస్తు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశం ఈనెలాఖరు వరకు ఉందని, దానిని ఆస్తిపన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం ఏఎంసీ ప్రవీణ్‌కుమార్, ఇతర సిబ్బందితో కలిసి ఆయన ప్రత్యేక ఆస్తిపన్ను వసూలు డ్రైవ్ నిర్వహించారు. ఎర్లీబర్డ్ పథకం కింద 5 శాతం రాయితీ లక్ష్యాన్ని సర్కిల్ –16, 90 శాతం వసూలు చేశామన్నారు. తమ సర్కిల్‌కు రూ.23 కోట్ల లక్ష్యం ఉంటే ఇప్పటికీ రూ.20 కోట్లు వసూలు చేశామన్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న సర్కిళ్లలో తమ సర్కిల్ ఎర్లీబర్డ్ పన్ను వసూళ్లను ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈనెల ముగియడానికి మరో రెండు రోజుల్లో సాధ్యమైనంత ఆస్తి పన్నును వసూలు చేస్తామన్నారు. ఆస్తి పన్నుపై ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రవక్త కుమార్తె సమాధిని పునర్నిర్మించాలి

కవాడిగూడ: సౌదీ అరేబియాలోని అదే స్థలంలో ప్రవక్త మహ్మద్ కుమార్తె ఫాతిమాబేగం సమాధిని వెంటనే పునర్నిర్మించాలని పలువురు ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో 'అల్ బాకీ' సంస్థ ఆధ్వర్యంలో జనాతుల్ బాకీ రాక్షసీకరణకు వ్యతిరేకంగా ముస్లిం మత పెద్దలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మత పెద్దలు మౌలానా వషీ హసన్‌ఖాన్ (యూపీ), అబ్దుల్ హమీద్ రహమాని, మోసిన్ షబీ ముక్తార్ మౌలానా, మౌలానా హస్కర్ హసన్ దీ, మౌలానా ఇమ్రాన్ హైదర్‌లు మాట్లాడుతూ.. 1925 ప్రవక్త మహ్మద్ కుమార్తె ఫాతిమా బేగం సమాధిని సౌదీ అరేబియాలో కూల్చేశారని అదే స్థలంలో సమాధిని పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. తన మూలాలను కలిగి ఉన్న సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. సౌదీ అరేబియా ప్రభుత్వం వెంటనే 'జనాతుల్ బాకీ'ని వెంటనే పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

'ఏజెంట్' సినిమాను వీక్షించిన ప్రొడక్షన్ టీమ్



చిక్కడపల్లి: అఖిల్ అక్కినేని హీరోగా నటించిన ఏజెంట్ సినిమా శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌లో విడుదలైంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన సాక్షి వైద్య థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. థియేటర్ యాజమానులు టి.బాలగోవింద్, విశ్వంభర్, మేనేజర్లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌లు ప్రొడక్షన్ టీమ్‌కు స్వాగతం పలికారు.

'స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసేందుకు కుట్ర' !



సుప్రీంకోర్టు న్యాయవాది సుభాష్ ఝూ

కాచిగూడ: స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయడానికి బుద్ధి పూర్వకంగా చేస్తున్న కుట్ర అని సుప్రీంకోర్టు న్యాయవాది సుభాష్ ఝూ అన్నారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో 'సుప్రీంకోర్టులో స్వలింగ సంపార్కానికి ఇంత ప్రాముఖ్యత దేనికి?' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారని బర్కత్‌పురలోని హిందూ జన జాగృతి సమితి రాష్ట్ర ప్రతినిధి చేతన్ గాడి ఓ ప్రకటనలో తెలిపారు. ఝూ మాట్లాడుతూ.. 'స్వలింగ సంపర్కం అనేది సమాజంలోని కొన్ని వర్గాలకు మాత్రమే చెందిన రుగ్మత అందుచేత ఇది చర్చనీయాంశం కానే కాదని' అన్నారు. ప్రభుత్వం కరోనా వైరస్ విషయంలో చేసినట్టే దీనికి కూడా ఓ చికిత్సను అమలు చేయాలని సూచించారు. 'భవిష్యత్తులో రాజ్యాంగం తమకు హక్కు కల్పించిందంటూ.. దొంగతనాలకు పాల్పడొచ్చని, స్వలింగ సంపర్కం కూడా ఇలాంటిదేనన్నారు.' స్వలింగ సంపర్కం కోసం పిటీషన్లు దాఖలు చేసిన వ్యక్తుల నేపథ్యంపై ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

రూ.8.5 లక్షలతో అభివృద్ధి పనులు



అంబేద్కర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: ప్రజలకు మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో రూ.8.5 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నాటి పైప్‌లైన్ స్థానంలో కొత్త వాటిని నిర్మించినట్లు తెలిపారు. వర్షాకాలం వచ్చేలోపే నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం అంబేద్కర్‌నగర్, మందుల బస్తీ, జమ్‌జా మసీద్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జలమండలి అధికారులు, స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు



చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లో కెనరాబ్యాంక్ లేన్ వద్ద ఉన్న కచ్చామోరీలోని చెత్త, మట్టిని తొలగించే పనులను జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వరదనీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు.

- ప్రమాదకరంగా భారీ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై అనుకొని ఉన్న వాటిని ఉద్యానవన అధికారులతో కలిసి కొట్టివేయించామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు ఎం.ఉమేష్, బాలస్వామి, లక్ష్మణ్‌యాదవ్, మహమూద్, చిప్పరాజు, ధన్‌రాజ్, డేవిడ్, వేణు, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా..



డ్రైనేజీ సమస్యపై స్థానికులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ కమాన్ బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి అన్నారు. శుక్రవారం స్థానికుల ఫిర్యాదుల మేరకు ఆయన శ్రీరాంనగర్ కమాన్ బస్తీలో పర్యటించారు. వాటర్‌వర్క్స్ జీఎం రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ.. బస్తీలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

దేశ సమగ్రతకు శాస్త్రీయ కళలు ప్రతీక



అంజిబాబును సన్మానించిన కృష్ణమోహన్‌రావు, వోలెటి పార్వతీశం తదితరులు

చిక్కడపల్లి: దేశ సమైక్యత, సమగ్రతలకు సంప్రదాయం శాస్త్రీయ కళలు ప్రతీకలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం త్యాగరాయగానసభలో ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా కథక్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో భారతీయం పేరిట భిన్న నాట్య ప్రక్రియల ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్య కళాకారులను కథక్‌కళాక్షేత్రం నిర్వాహకుడు పండిత్ ఆంజిబాబును అభినందించారు. కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. భిన్న భాషలు, విభిన్న మతాలు, సంస్కృతిల భారత పూదోటలో కళలు ప్రజలను ఏకతాటిపై నిలిపేందుకు దోహదపడుతున్నాయన్నారు. ఇంటర్నేషనల్ మెజీషియన్ సామాల వేణు మాట్లాడుతూ.. దేశ సంస్కృతికి జాతి చిరునామా కళలు అన్నారు. సాహితీవేత్త వోలెటి పార్వతీశం, కళపత్రిక రఫీ, పోలీస్ ఉన్నతాధికారి వెంకటేశ్వర్లు, కళా విపంచి నర్సింహారావు, శోభ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మీ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్ సాయిబాబా దేవాలయం ఎదురుగా బీఆర్ఎస్ నాయకులు రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు జైసింహ, నాయకులు ముకేష్‌రెడ్డి, జమాలుద్దీన్, సంతోష్, వేణు, రమణ, శంకర్, శ్రీధర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



బీజేపీ వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో గౌతమ్‌రావు తదితరులు

అంబర్‌పేట: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ చేపట్టిన వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో పోలింగ్‌బూత్ నెంబర్ 30 పరిధిలో వాల్ పెయింటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చే హామీలన్ని ప్రకటనలకే పరిమితమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణగౌడ్, రమేష్, చుక్క జగన్, బుచ్చిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలను తొలగించండి

కాచిగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కుద్బిగూడ, చెప్పల్‌బజార్ ప్రాంతాల్లో ఆమె అధికారులు, సిబ్బందితో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని ఆమె అధికారులకు సూచించారు. రోడ్లపై చెత్త, మట్టిని ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని, పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు చెప్పారు. చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుభాష్ పటేల్, ఆనంద్, ఉపేందర్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, రాజు, దీపక్, శాంతాబాయి, సుజాత, నగు, లాల్‌బాషా, దినేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మట్టి కుప్పలను చూపుతున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

భక్తి శిక్షణ శిబిరానికి విశేష స్పందన



నల్లకుంట: శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో నిర్వహిస్తున్న వేసవి భక్తి శిక్షణా శిబిరానికి విశేష స్పందన వస్తోందని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి అన్నారు. శుక్రవారం నల్లకుంట శివంరోడ్డు కూరగాయల మార్కెట్ వీధిలో చిన్నారులకు కీ బోర్డుపై శిక్షణ ఇచ్చారు. వసుధా మూర్తి, యామిని, నందినీల పర్యవేక్షణలో శిక్షణా తరగతులు కొనసాగాయి.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ !



బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయం వద్ద ఇలా..

కాచిగూడ: బర్కత్‌పుర చమన్ నుంచి నల్లకుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో పీఎఫ్ కార్యాలయం వద్ద మ్యాన్‌హోల్ మూత పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మ్యాన్‌హోల్ వద్ద డీవైఎఫ్ఐ నేతలు జావేద్, హస్మిబాబు స్పందించి ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ ఎ.సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన నలుపు రంగు చొక్కా, నీలిరంగు ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



భువనేశ్వరి (ఫైల్)

చిక్కడపల్లి: ఓ గృహిణి ఇంట్లో నుంచి చెప్పకుండా అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రతాపసింగారంకు చెందిన జున్ను మనోజ్, భువనేశ్వరి భార్యభర్తలు. కాగా దంపతులు అత్తగారింటికి వచ్చి మనోజ్ పనిమీద బయటకు వెళ్లిన సమయంలో భార్య ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులను ఇవ్వాలి



ముషీరాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసి సన్న బియ్యం అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరుతూ.. ముషీరాబాద్ తహసీల్దార్‌కు శుక్రవారం పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో నిత్యావసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టం చేసుకుని బతికే సామాన్య ప్రజలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన 12 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు.

- 12 రకాల నిత్యావసర సరుకుల్లో మంచినూనె, కందిపప్పు, ఉప్పు, కారం, పసుపు, పల్లీలు, పంచదార, గోధుమలు తదితర వాటిని ఇవ్వాలని కోరారు. కేంద్రం ఇచ్చే 5 కేజీల బియ్యంతో పాటు రాష్ట్రం కూడా 5 కేజీలు ఇవ్వాలన్నారు.
- చాలా రోజుల నుంచి కొత్త వారికి రేషన్ కార్డులు ఇవ్వలేదని దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య కుటుంబాలు ఉపయోగించలేని పరిస్థితి నెలకొందన్నారు. వంట గ్యాస్‌ను సగం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వరలక్ష్మి, రవికుమార్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మ, డీఎస్‌నగర్, బండమైసమ్మ–1, ఎల్బీగూడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు అందుతున్న సేవలు మరువలేనివని బాల్యం నుంచే చిన్నారులకు మంచి అలవాట్లు, ఆరోగ్యంతో ఉండాల్సిన అలవాట్లను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించినప్పుడే శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. తల్లిదండ్రులు 0–5 ఏళ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు ధనమ్మ, కవిత, సంతోషిణి, రఫియా, ఆయాలు విజయ, వనమాల తదితరులున్నారు.

గ్రంథ కర్త భాషాభిమాని మాడపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్

చిక్కడపల్లి: తెలుగు భాష పట్ల అభిమానంతో తెలంగాణలో ఆంధ్రోద్యమం గ్రంథ రచనతో పాటు ఉర్దూ, ఇంగ్లిష్ భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించిన బహు గ్రంథకర్త మాడపాటి హనుమంతరావు అని రాష్ట్ర శాసనమండలి సభ్యుడు బొగ్గరపు దయానంద్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో మాడపాటి హనుమంతరావు సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1885లో ఆంధ్ర ప్రాంతంలో జన్మించిన హనుమంతరావు హైదరాబాద్ తొలి మేయర్, శాసనమండలి అధ్యక్షులుగా గ్రంథాలయోద్యమానికి కృషి చేశారన్నారు. ఆయన పేరిట నేటికి నారాయణగూడలో బాలికల పాఠశాల ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, పొత్తూరి సుబ్బారావు, గాయని శ్రీమణి, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసులతోనే ప్రశాంత వాతావరణం



ఏసీపీ యాదగిరి, సీఐ జహంగీర్‌యాదవ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: ఫ్రెండ్లీ పోలీసులతోనే ప్రశాంత వాతావరణం నెలకొంటుందని దీనికి ముషీరాబాద్ పోలీసులు ఆదర్శమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నందికంటి గోపాల్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి తదితర పండుగలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసినందుకు పోలీసులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, సీఐ జహంగీర్‌యాదవ్‌లను సన్మానించి మాట్లాడారు.

- గతంలో పోలీస్‌స్టేషన్ అంటే ప్రజలు భయపడే వారని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. ముషీరాబాద్ పోలీసులు అన్ని వర్గాల పండుగలను నిర్వహిస్తూ.. ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తున్నారన్నారు.
- ప్రజలతో మమేకమై శాంతియుత వాతావరణానికి పోలీసులు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎస్సైలు సురేందర్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, డీఐ ప్రశాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, నగర నాయకుడు ముఠా జైసింహ, జేష్ పటేల్, రాజేందర్, కె.నర్సింగ్‌ప్రసాద్, డి.శివముదిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, సదా, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను శుక్రవారం హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి జగదీశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగవాణి, జాయింట్ సెక్రటరీలు ఏ.ప్రశాంత్, నర్సింహ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇళ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే ముఠా గోపాల్

జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హెచ్‌యూజే ప్రతినిధి బృందానికి తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

ముషీరాబాద్: యువత క్రీడల్లో రాణిస్తూ.. రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ కిట్లలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ.. క్రీడా మైదానాలను ఆధునీకరిస్తున్నారన్నారు. ముషీరాబాద్‌లో ప్రతి బస్తీ, కాలనీల్లో క్రీడాకారులను గుర్తించి వారు మరింతగా రాణించేలా తమవంతు సహకారం అందిస్తామన్నారు. విద్యతో పాటు తప్పనిసరిగా క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉజ్వల భవిష్యత్తుకు ముందుకెళ్లారన్నారు. టి.సోమన్, శ్రీనివాస్‌రావు, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎయిర్‌టెల్‌రాజు, గోరఖ్‌నాథ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లను అందజేస్తున్న బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ